# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 06-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్, వియత్నాం దేశాల మధ్య సంబంధాలు ఎంతో ప్రాధాన్యత కలిగినవని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కోసం టీవీకే పార్టీ అధ్యక్షుడు సి. జోసఫ్ విజయ్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ను ఈరోజు కలిశారు.
- ❖ పశ్చిమ బెంగాల్‌లో కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 9వ తేదీన బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరగనుంది.
- ❖ హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

డిజిటల్ టెక్నాలజీ, అరుదైన ఖనిజాలు, వైద్య ఉత్పత్తుల నియంత్రణ, ప్రభుత్వ రంగ ఆడిట్, డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ, సంస్కృతి, పర్యాటకం వంటి రంగాలలో భారత్, వియత్నాం దేశాలు ఈరోజు పలు అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, వియత్నాం అధ్యక్షుడు టో లామ్‌ల మధ్య ఈ రోజు జరిగిన చర్చల అనంతరం ఈ ఒప్పందాలు కుదిరాయి. ఈ చర్చల సందర్భంగా.. ఇరు దేశాల నాయకులు ద్వైపాక్షిక సంబంధాలలోని వివిధ అంశాలపై, అలాగే పరస్పర ఆసక్తి ఉన్న ప్రాంతీయ, ప్రపంచ సమస్యలపై కూడా విస్తృతంగా చర్చలు జరిపారు. అనంతరం నరేంద్ర మోదీ పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... భారత్, వియత్నాం సంబంధాలు ఎంతో ప్రాధాన్యత కలిగినవని చెప్పారు. ఈ అవగాహన ఒప్పందంతో వియత్నాంలో భారతదేశ ఔషధాల లభ్యత ఇకపైన పెరుగుతుందని ఆయన అన్నారు. భారతదేశం నుండి వ్యవసాయం, మత్స్య, పశు ఉత్పత్తుల ఎగుమతులు కూడా వియత్నాంకు మరింత సులభతరం అవుతాయని నరేంద్ర మోదీ తెలియచేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

ఇదిలా ఉండగా... భారతదేశంతో సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి వియత్నాం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని అధ్యక్షుడు టో లామ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

తమిళనాడులో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కోసం ఆహ్వానం కోరుతూ.. టీవీకే పార్టీ అధ్యక్షుడు సి. జోసఫ్ విజయ్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ను చెన్నైలోని లోక్‌భవన్‌లో ఈరోజు కలిశారు. పార్టీ సీనియర్ నాయకులైన K.A. సెంగుట్టువన్, N.ఆనంద్, CTR నిర్మల్ కుమార్, మాజీ IRS అధికారి అరుణ్ రాజ్ ఆధవ్ అర్జున ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ కి తమ పార్టీకి లభించిన స్థానాల వివరాలు తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో అతి పెద్ద పార్టీగా టీవీకే నిలిచింది. ఆ పార్టీకి 108 స్థానాలు లభించాయి. అంతకుముందు, కాంగ్రెస్ నాయకుడు గిరీష్ చోడంకర్ ఆ పార్టీకి చెందిన ఇతర నాయకులు TVK అధ్యక్షుడు విజయ్ ని కలిసి.. ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు లేఖను అందజేశారు. ఇదిలా ఉండగా అతిపెద్ద ఏకైక పార్టీ అయిన TVK పార్టీని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి ఆహ్వానించే తుది నిర్ణయాన్ని ఒకటి లేదా రెండు రోజుల్లో తీసుకుంటానని గవర్నర్ పాత్రికేయులకు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా గృహ వినియోగదారుల ఎల్‌పీజీ పంపిణీ సాధారణంగా జరుగుతోందని పెట్రోలియం సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన అంతర్ మంత్రిత్వ శాఖల మీడియా సమావేశంలో మాట్లాడుతూ... దాదాపు 95 శాతం ఎల్‌పిజి సిలిండర్ల డెలివరీలు అథెంటికేషన్ కోడ్ ద్వారా జరుగుతున్నాయని చెప్పారు. అదనంగా 2 లక్షల 67 వేల పీఎన్‌జీ కనెక్షన్‌ల కోసం మౌలిక సదుపాయాలను కల్పించామని సుజాత శర్మ పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్‌లో కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 9వ తేదీన బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరగనుంది. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు సమీక్ భట్టాచార్య పాత్రికేయులకు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ పాలిత రాష్ట్రాలకు చెందిన పలువురు ముఖ్యమంత్రులు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

అసోంలో అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో.. ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిస్వా శర్మ గువహటిలోని లోక్ భవన్‌లో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యకు ఈరోజు తన రాజీనామాను సమర్పించారు. ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ఈ రాజీనామా ద్వారా మార్గం సుగమం చేసినట్లు అయింది. అనంతరం హిమంత బిస్వ శర్మ పాత్రికేయులతో మాట్లాడుతూ.. మంత్రిమండలి రాజీనామాను గవర్నర్ ఆమోదించారని, ప్రస్తుత శాసనసభను రద్దు చేశారని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకూ కొనసాగాలని గవర్నర్ కోరారని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈ నెల 11వ తేదీ తర్వాత జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించినట్లు కూడా హిమంత బిస్వ శర్మ తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని 19 జిల్లాలను కలుపుతూ రైల్వే ప్రాజెక్టులకు కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలపడాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ ప్రాజెక్టులు దేశ మౌలిక సదుపాయాలు, ఆర్థిక వృద్ధిని పెంచడంతో పాటు అనుసంధానాన్ని మెరుగుపరిచి కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచుతాయని సామాజిక మాధ్యమం వేదికగా పెట్టిన పోస్టులో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు దేశవ్యాప్తంగా ఉన్న కీలక పర్యాటక ప్రదేశాలకు రవాణా మార్గాన్ని మరింతగా మెరుగుపరుస్తాయన్నారు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను 33 నుండి 37కు పెంచాలన్న కేంద్రమంత్రి వర్గం నిర్ణయాన్ని కూడా నరేంద్ర మోదీ అభినందించారు. ఈ నిర్ణయం దేశ న్యాయ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తుందని.. ప్రజలకు సత్వర న్యాయం అందేలా చూస్తుందని ప్రధానమంత్రి అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

జపాన్ శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి ఒనోడా కిమి న్యూఢిల్లీలో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్‌ను ఈరోజు కలిసి ఆరోగ్యం వైద్య పరికరాల రంగంలో సహకారంపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శాస్త్ర సాంకేతిక రంగాలలో భారత్, జపాన్‌ల మధ్య సహజమైన సమన్వయం ఉందని అన్నారు. రెండు దేశాలు కలిసి వివిధ రంగాలలో ఆవిష్కరణలను వేగవంతం చేయగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిశోధనలు సమాజంపై ప్రభావం చూపించగలవన్నారు. క్వాంటం టెక్నాలజీస్, సైబర్-ఫిజికల్ సిస్టమ్స్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ రంగాలలో భారతదేశం విస్తరిస్తున్న విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఒనోడా కిమి మాట్లాడుతూ... ఈ సమావేశంలో కుదిరిన ఒప్పందాలు పరిశోధన, అనువర్తనం, పారిశ్రామిక విస్తరణ రంగాలలో మంచి సహకారాన్ని అందిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తులుగా 10 మంది న్యాయవాదుల నియామకానికి సంబంధించిన ప్రతిపాదనను సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదించింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని కొలీజియం న్యాయవాదులు మోనికా చిబ్బర్ శర్మ, హర్మీత్ సింగ్ డియోల్, పూజా చోప్రా, సునీష్ బింద్లిష్, నవదీప్ సింగ్, దివ్య శర్మ, రవీందర్ మాలిక్, ప్రవీంద్ర సింగ్ చౌహాన్, రాజేష్ గౌర్, మిందర్‌జీత్ యాదవ్‌ల పేర్లను న్యాయమూర్తులుగా ఆమోదించింది. ప్రవీంద్ర సింగ్ చౌహాన్ ప్రస్తుతం హర్యానా అడ్వకేట్ జనరల్‌గా ఉండగా.. డియోల్ పంజాబ్ అదనపు అడ్వకేట్ జనరల్‌గా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులుగా ముగ్గురు న్యాయాధికారుల నియామకానికి సంబంధించిన ప్రతిపాదనను కూడా కొలీజియం ఆమోదం తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్-2026లో భాగంగా హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన పంజాబ్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 12 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్ల నష్టపోయి 134 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, బీహార్, కేరళం, పశ్చిమ బెంగాల్, సిక్కిం, తమిళనాడు, పుదుచ్చేరిలోని కొన్ని ప్రాంతాలలో రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) పేర్కొంది. అండమాన్ నికోబార్ దీవులు, అస్సాం, మేఘాలయ, తూర్పు రాజస్థాన్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీలోని కొన్ని ప్రాంతాలలో ఉరుములతో కూడిన మెరుపులు, ఈదురు గాలులు వీస్తాయని అంచనా వేసినట్లు ఐఎండీ శాస్త్ర వేత్త డాక్టర్ సుప్రీత్ కుమార్ తెలియజేస్తూ....

(వాయిస్ 28 సెకన్లు)

====================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 77 వేల 017 పాయింట్ల వద్ద లాభాలతో ప్రారంభమై.. చివరికి 941 పాయింట్ల లాభంతో 77 వేల 958 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 298 పాయింట్లు లాభపడి 24 వేల 330 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94 రూపాయల 62 పైసలుగా ఉంది.

====================

====================